# విచిత్ర పళ్లాలం

రిక్షాను పిలిచిందామె. పిలుస్తూనే తనవెంటపడి పిచ్చిచేష్టలుచేస్తున్న వాళ్ళవైపు అసహ్యంగా, భయంగా చూచింది. రిక్షా ఆత్రంగా వచ్చి ఆమె వద్ద ఆగింది.

ఆమె రిక్షాను చూచింది. లోపలికి పీక్కుపోయిన కళ్ళల్లోకి శక్తి నంతా కేంద్రీకృతంచేసి రిక్షావాడు ఆమెవైపు చూస్తున్నాడు.

సంధియుగంలో మానవుడి బ్రతుకులా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. బజార్లో విద్యుద్దీపాలింకా వెలగలేదు.

"ప్రకాశ్‌నగర్‌కి ఏం తీసుకుంటావ్ !"

అతను మాట్లాడలేదు. మాటలు రాకకాదు-మాట్లాడలేక ! ఆమె వైపు అలాగే చూస్తూ నిలబడిపోయాడు. అతని చూపులలోని భావాలు దుబ్బుగా పెరిగిన గడ్డం వెనుక దాగాయి.

ఆమె చాలా అందంగా ఉంది.

బ్రతకలేక ఆత్మహత్యచేసుకున్న గుమాస్తాలా సూర్యుడు అస్త మించాడు.

బజార్లో విద్యుద్దీపాలు వెలిగాయి. విద్యుద్దీపాల కాంతిలో వెలుగు తున్న ఆమె అందానికీ, విద్యుద్దీపాలకూ పోటీపడింది.

కాని అతను ఆమె అందాన్ని చూస్తున్నట్లులేదు. ఏమిటో చూస్తు

న్నాడు. చూస్తున్నట్లు తెలియకుండానే అలా చూస్తూ నిలబడిపోయాడు. అయినా ఆమె అతన్నంతగా గమనించలేదు.

ఆమెకు కోపం వచ్చింది. తనవైపెవరైనా పురుషులు చూచినప్పుడల్లా ఆమెకు కోపం వస్తూనే ఉంటుంది. అలాగని ఆమెవైపు చూడటం ఎవరూ మానలేదనీ ఆమెకు తెలుసు. బజార్లో అడుగుపెట్టితే అందరి కళ్ళూ ఆమెవైపే పరుగెత్తుతాయి. కొన్ని కళ్ళు కాళ్ళు చేసుకుని ఆమెను ఆఫీసుదాకా దిగపెట్టుతాయి. ఆఫీసులో అడుగుపెట్టేసరికి కొన్ని కళ్ళు కుర్చీల్లో కూర్చొని ఆమెకోసం నిరీక్షిస్తూంటాయి. ఈ కళ్ళ బారినుండి తప్పించుకునేటందుకే ఆమె ఎంతో అవసరముంటే తప్ప బయటికి రాదు. ఇంత నాగరకమైన ప్రపంచంలో కూడా పురుషులు అందమైన స్త్రీల నెందుకలా చూపులతో హింసిస్తూంటారో ఆమెకు అర్థం కాదు.

ఉద్యోగం చేయడం ఆమెకు ఇష్టంలేదు. ఉద్యోగంలో చేరికూడా నెల కాలేదు. ఆమెకు ఇష్టంలేని పనులను ఆమెచేత చేయించటాన్నే విధి పనిగా పెట్టుకొన్నట్లు ఆమె అనుకొంటుంది. అనుకొని రాత్రిళ్ళు ఒంటరిగా కూర్చుని ఏడుస్తూంటుంది.

అత నింకా ఆమెవైపు చూస్తున్నాడు.

"ఏం గుడ్లగూబలాగా అలా చూస్తావ్ ! అడిగేది విన్పించటం లేదూ ! ప్రకాశ్‌నగర్‌కు ఏం తీసుకుంటావ్ !" కోపంగా అందామె వెనుక నున్న "హీరో" లవైపు చూస్తూ.

అతను తల దించుకొన్నాడు. మొహంలోని విచారరేఖలు గడ్డాన్ని అతిక్రమించి పైకి వచ్చాయి.

"క్ష....మిం....చం....డి !" అని గొణిగాడతను.

"అబ్బే నిన్నుకాదు రిక్షా ! ఆ వెనుక వస్తున్నారే ఆ రోగ్సును !"

ఆమె రిక్షా ఎక్కింది,

అతను రిక్షా తొక్కుతున్నాడు. కాని అదీ కదలనంటూంది. అతని

కాళ్ళ శక్తికి, రిక్షా గమనానికి పోటీపడింది. ఫలితంగా అతని ఆయాసం పెరిగింది.

ఆకాశంలో మబ్బులు అలముకొంటున్నాయి దట్టంగా.

"చూచావా రిక్షా ! ఒంటరిగా ఉన్న ఆడవాళ్ళంటే ఈ మొగాళ్ళ కెంత అలుసో !"—కాని రిక్షా వినలేదు.

రిక్షా అతని బుర్రలో ఎన్నెన్నో ఆలోచనలు పులుముకొంటున్నాయి. కాని అతని ఆలోచనలను అణగద్రొక్కేస్తున్నది. ఆయాసం.

తన అప్పటిపరిస్థితికి అతనికి ఏడుపు వచ్చింది. డబ్బులు కావాలి. కాని తొక్కే ఓపిక లేదు. ఏం చేయటం !

ఆ రోజు బోణీ అదే అతనికి. అదే తుదికూడా ! ఇంకో అర గంటలో అద్దెతోపాటు రిక్షాను యజమాని కివ్వాలి. కాని చేతిలో నల్లని నయాపైసా లేదు. ఇంట్లో బియ్యంలేవు. ఒంట్లో శక్తి లేదు బ్రతకటానికి వీలులేదు. చావటానికి ధైర్యంలేదు. జీవితంమీద ఆశ ఇంకా చావలేదు.

రిక్షా ఆపి బజారు కొళాయి దగ్గరి కెళ్ళి కాసిని నీళ్ళు కడుపుకు పట్టించి వచ్చాడు. రిక్షా సాగింది.

గాలి ఉప్పెనలాగా వచ్చి రిక్షాను ముందుకు తోసింది. రిక్షాతోపాటు ఆలోచనలుకూడా ముందుకొచ్చి నిలబడి వికృతంగా నవ్వాయి. ఆకాశం భార్యమీద కోపంవచ్చిన భర్తలా ఉరిమింది.

"వర్షం వచ్చేలాగుంది. కాస్త త్వరగా పోనియ్ రిక్షా !" అని ఆమె అంటూండగా వర్షం రానేవచ్చింది. ఆమె లోపలికొదిగి కూర్చుంది. అతను తొణకకుండా రిక్షాను తొక్కుతూనే ఉన్నాడు.

"అదిగో—అదే ఇల్లు. అక్కడ ఆపు"

అతను ఆమెచెప్పింది విన్నాడు. కాని మాట్లాడలేదు.

"పాపం—వర్షంలో తడిసినట్లున్నావ్. లోపలికి రా. వాన తగగానే వెళ్ళుదువుకాని" అందామె జాలిగా.

అతను నెమ్మదిగా నవ్వుకున్నాడు. ప్రమోషన్ కోసం దినం దినం ఎదురుచూస్తున్న గుమాస్తా ఆశలా, ఆ నవ్వు చీకట్లో వెలిగింది.

"ఫర్వాలేదు" అని అన్నాడు ముక్తసరిగా.

ఆమె చేతిసంచీ తెరిచింది. "అరె—చిల్లర లేదు రిక్షా! లోపలికి రా ఇస్తా" అని అంటూ ఆమె రిక్షాదిగి చకచకా నడిచి ఇంట్లోకి వెళ్ళింది. రెండు నిముషాల్లో డబ్బులు తీసుకుని బయటికి వచ్చి చూచింది. రిక్షా అతను లేడు. రిక్షా వెళ్ళిపోయింది. ఆమె ఆశ్చర్యంతో అలాగే నిలబడిపోయింది. విసురుగా కొట్టిన వానజల్లు ఆమె ముఖాన్ని తడిపివేసింది.

* * *

పాత దుప్పటి కప్పుకొని అతను పడుకొన్నాడు.

లోపల రంగమ్మవ్వ వండుతున్న అన్నం ఉడుకుపట్టి "బుడబుడ" గొడవచేస్తూంది.

ఎదురుగా గూట్లో వెలుగుతున్న ఆముదపు ప్రమిద దీపంవంక కళ్ళార్పకుండా అలాగే చూస్తూ పడుకొన్నాడు అతను.

"నిద్రపోయేవురోయ్ అబ్బీ! బువ్వ ఉడుకు పట్టింది. అంత తిని పడుకో!" పచ్చిపుల్లలను ఊదుతూ అంది రంగమ్మవ్వ తడికె అవతలి వంటింట్లోనుంచి.

అతను అవ్వ పిలుపును విన్నాడు, కానీ మాట్లాడలేదు. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి.

"అవ్వే లేకపోతే తన బ్రతుకేమై ఉండేది!" అని అనుకొన్నాడతను మనస్సులో.

నిజంగా అవ్వకూ, అతనికీ ఏం సంబంధం ఉంది!.... ఏమీ లేదు. కానీ అవ్వే అతని సర్వస్వం! అవ్వ కతనే అంతా!

ఒకరోజు అచ్చంగా ఇలాంటిరోజే—ఉద్యోగం కోసం ఊరంతా కాలికి బలపం కట్టుకొని తిరిగి, అలసిపోయి, బజారులో సోషవచ్చి పడి

పోయాడు. బజారున పోయే కొందరు పెద్దలు అతన్ని పక్కకు చేర్చి, తామేదో సేవచేసినట్లు మురిసిపోతూ వచ్చిన దోవనే వెళ్ళిపోయారు. మరి కొందరు నీళ్ళు చల్లండన్నారు. ఇంకా ఎన్నెన్నో ఉచిత సలహాలు విసిరి వేశారు. అదన్నారు, ఇదన్నారు. అంతాచేసి అతనికి తెలివివచ్చేసరికి అవ్వ ఒక్కతే ప్రక్కన కూర్చుని ఉంది. మిగతావాళ్ళంతా కాస్సేపు తమాషా చూచినట్లు చూసి ముష్టి వెధవతో మనకేమిటన్నట్లు తప్పుకుపోయారు.

"ఎలా ఉంది నాయనా !" అందామె ప్రేమగా.

"ఆకలి" నీరసంగా అన్నాడతను.

"అయ్యో-పదనాయనా ఇంటికిపోదాం ! ఇంకా ఇది మూర్ఛేమో ననుకున్నాను" అని అంటూనే రోడ్డుప్రక్కన ఉన్న చిన్న బల్లకొట్టును మూట కట్టేసి రిక్షాను పిలిచింది.

ఇంటికి తీసుకువెళ్ళి ఇంత అన్నం తినిపించాక అతన్ని గురించి అడిగింది.

"నేనా....వ్వా !" అన్నాడతను. అని నవ్వాడు. ఆ నవ్వు వెనుక నున్న నిరాశను అవ్వ కూడా కనిపెట్టింది.

"ఏమిటి నాయనా అది !"

"ఏదవ్వా !"

"అదే నాయనా—ఆ నిరాశ !"

"అదే అవ్వా నా జీవితం—నా చరిత్ర ! నా బ్రతుకు నాకిచ్చిన బహుమతి కూడా అదే !" అని అన్నాడు అతను. అంటూనే నవ్వాడు. ఈమా రతని నవ్వు స్వచ్ఛంగా, వెన్నెల వర్షించినట్లు ఉంది. అవ్వ కతని మాటలు, చేతలు అర్థం కాలేదు.

"నే చెప్పింది అర్థం కాలేదు కదవ్వా ! అయితే అర్థమయ్యేలా విడ మర్చి చెప్తాను విను. నా పేరు అవధాని !"

"అవధాని....అవధానంటే . మా ఊళ్ళో ఒక బేపనాయన ఉండే వాడు. నువ్వు ..."అంటూ ఆగింది.

"అడుగవ్వా ! సందేహిస్తావేం !"

"అదె....బేమ్మడివా అని !"

"అవును."

"అయ్యో—ఖొరపాపైంది బాబూ ! తెలీక నా చేతి అన్నం తిని పించాను. లేకపోతే...."

"ఊఁ ! లేకపోతే ఆకలితో నన్ను చావనిచ్చేదానివా ! ఏమిటవ్వా ! ఆకలితో చస్తున్నవాడికి అన్నం పెట్టడానికికూడా బ్రాహ్మణత్వం అడ్డొస్తుందా ! ఆకలేస్తున్నవాడికి అన్నం కావాలి కాని ఈ కులాలెందుకవ్వా ? చస్తున్న నాకు దేవతలా అమృతం పోసి బ్రతికించావు." అతని కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"అందుక్కాదులే నాయనా. .... కానియ్ చెప్పు."

"నాపేరు అవధానని చెప్పేనుకదూ ! కాని నేను అవధానా లేమీ చేయలేదు. కనీసం చిన్నప్పుడు నేర్చుకున్న సంధ్యావందనంకూడా జ్ఞాపకం లేదు. మా తాత మహాపండితుడు. అవధానాలు చేసేవాడు. కాని దరిద్రం తోనే జీవితాంతం బాధపడ్డాడు. అచ్చం నేనూ నా తాత పోలికనేవారు చిన్నప్పుడంతా. అందుకే ఆయన పేరుతోపాటు దరిద్రం కూడా నాకు ఆయన ఆస్తిగా సంక్రమించింది. పోతే—నేనూ, వేదం కాకపోయినా, అంతో ఇంతో చదువుకొన్నాను."

"చదువుకొన్నావు కూడానా !....అవునులే... ఏదో కాస్త చదువు కొని ఉంటావు. ఈకాలంలో గొప్పగొప్ప చదువులు చదివిన వాళ్ళకే ఉద్యోగాలు లేకపోయె."

అవధాని నీరసంగా నవ్వాడు.

"అయితే నీవాళ్ళంతా ఎక్కడుంటున్నా రేమిటి ?"

అశనిపాతంలా ఆ ప్రశ్న అవధాని హృదయాన్ని ఛేదించింది. హృదయాన్ని అతిప్రయత్నంతో చిక్క పట్టుకున్నాడు. నిశ్శబ్దంగా ఊపిరి

పీల్చాడు. శూన్యంలోకి ఒక్క క్షణం తీవ్రంగా చూచాడు. వెంటనే నవ్వే శాడు బిగ్గరగా.

"కావాలనుకుంటే ఎక్కడైనా ఉంటారవ్వా ! ఇక్కడ నువ్వులేవూ! నువ్వు నాకా ప్తురాలివికాదూ ! నీకన్నా నా క్కావలసినవాళ్ళెవరున్నారు !" అని అన్నాడు.

అవ్వ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

కాని అంతటితో ఊరుకోలేదు. ఊరుకొని ఉంటే ఈ రోజు, ఇప్పుడు అతని కింత బాధ ఉండేదికాదు.

"అది నిజమేలే నాయనా ! నాకు ఎవ్వరూ లేరు. చెట్టంత కొడుకు ఉత్తపుణ్యానికి, గాలి ధూళి లేకుండా చచ్చిపోయాడు. నిన్ను చూస్తూంటే ఈవాళ నా కొడుకును చూచినట్లే ఉంది. అందుకే నాయనా నీ కెవరైనా ఉన్నారా అని ఇంతగా అడుగుతున్నది ! ముసలిముండని చస్తే బయటికి లాగి చితి పెట్టేవాళ్ళు కావాలి కదా నాయనా !" కన్నీళ్ళు కుక్కుకుంటూ అంది అవ్వ. కాస్సేపాగి, మళ్ళీ నిరాశగా అంది—

అందరన్నట్లు ఈ ముసలిముండకు ఆశ ఎక్కువే నాయనా ! కాకపోతే నా మతిమండా—నువ్వు బేమ్మణబిడ్డ నన్న సంగతే మరచి పోయాను చూడు ! ఒక ముద్ద బువ్వపెట్టి, స్వర్గానికి నిచ్చెనేసేను చూశావా ఆశ్చర్యం !

అదేంలేదవ్వా. నా కలాంటి భేదాలు లేవు.

అవ్వ కళ్ళు ఆశతో నిండిపోయాయి. అనలేక అనలేక అంది : అయితే నీకెవ్వరూ లేరానాయనా !

"లేకేమవ్వా—నువ్వున్నావుగా !"

"నా సంగతి సరేలే నాయనా నేను తప్ప, నీకు తల్లి, తండ్రి, అన్నదమ్ములూ, భార్యాబిడ్డలూ ఎవ్వరూ లేరా నాయనా."

అవధాని గొంతులో వెలక్కాయ పడింది. ఏం చెప్పాలి సమాధానం ?

అతనికి తల్లి లేదు. అన్నదమ్ములు లేరు. తండ్రి ఉన్నా లేనట్లే. ఆయనకు తనతో అవసరం లేదు. తన కున్నా లాభం లేదు. ఇక మిగిలింది. భార్య . భార్య....

ఆ విషయాన్ని గురించి ఇక ఆట్టే ఆలోచించ లేకపోయాడు. నరాల్లో రక్తం ఉడుకుతూంది ఒకవైపు. మరొకవైపు....

"ఏం నాయనా ఆలోచిస్తున్నావ్ ! ఎవరైనా ఉన్నారా ?"

పెనవేసుకుంటున్న ఆలోచనల దారాలు పుటుక్కుమని తెగాయి.

"లే....రు." ఒక్కసారిగా అనేశాడు అవధాని ఆరోజు. అవ్వ ముడతలుపడ్డ ముఖం వికసించింది.

కాని ఈరోజు !

ఆ రోజన్న ఆ "లే—రు" అన్న రెండక్షరాలే ఈరోజు రెండు లక్షల శంఖాలై తన చెవుల్లో "ఉన్నారు" అన్న మూడక్షరాలను అనుక్షణం ఊదుతున్నాయి. రెండుకోట్ల ఢమరుకాలై "ఉన్నారు....ఉన్నారు" అని తన హృదయంలో ధ్వనిస్తున్నాయ్ ఆనాడు తెగిన ఆ ఆలోచనల దారాలే ఈనాడు కొండవీటి చేంతాడులై నరనరాలను అణువణువునా, "నా" అన్న భావనతో కట్టిపారేస్తున్నాయి.

"అన్నం ఉడికిందిరా అబ్బీ ! ఇగరంగానే పెట్తా, నిద్రపోయేవు!" అని హెచ్చరించింది అవ్వ లోపలినుంచి.

బయట తాటాకులమీద ఇంకా పడుకున్న చినుకులు శబ్దం చేస్తూనే ఉన్నాయి. చిన్న కిటికీగుండా చల్లనిగాలి దూసుకు వచ్చింది. గూట్లోని ఆముదపు ప్రమిదె చావుబ్రతుకులలో ఉన్న జీవిలాగా తపతపలాడింది.

అవధాని అంతరాత్మ తనెవ్వరినో ద్రోహం చేసినట్లు అవధాని

హృదయాన్ని పిలిచి పిలిచి చెప్పుతున్నది. కాదని తోసేసే శక్తి లేదు. గట్టిగా నిట్టూర్చి కళ్ళు మూసుకొన్నాడు.

ఉధృతంగా వీచిన గాలి వచ్చి మిణుకుమిణుకు మంటున్న దీపాన్ని ఆర్పివేసింది.

* * *

అవ్వ వచ్చి ఆరిపోయిన దీపాన్ని వెలిగించింది.

అవధానిని లేవతీసుకుని వెళ్ళి కూర్చోపెట్టి అన్నంపెట్టి తనెదురుగా కూర్చుంది.

అవధాని నోట్లో అన్నం పెట్టుకున్నాడు. కాని రుచించలేదు.

"చెప్పాలి. హృదయంవిప్పి చెప్పాలి. తనెంత దుర్బలహృదయుడో, తనెటువంటి అబద్ధాన్ని చెప్పాడో అన్నీ చెప్పాలి!" మనసులో నిశ్చయించుకుని తలఎత్తి అవ్వవైపు చూచి "అవ్వా" అని పిలిచాడు.

అవ్వ అతనివైపు చూస్తూ నవ్వుతూంది బోసినోటితో! "నువ్వు చెప్పేదేమిటో నాకు తెలుసు!" అన్నట్టుందానవ్వు!

"చెప్పు నాయనా నీ బాధేమిటో!"

అవధాని తను చెప్పదల్చుకొన్న విషయాన్ని ఎలా మొదలుపెట్టాలా అని ఆలోచిస్తున్నాడు.

"నువ్వు చెప్పకపోయినా నాకు తెల్సు. ఈ బియ్యం ఎక్కడనుండి వచ్చాయనే కదా నువ్వు అడిగేది! నీసొమ్ము తినడం నా కిష్టంలేదనేకదా నువ్వు చెప్పబోయేది!"

అది నిజమే! ఇంకోరోజైతే అదే అడిగి ఉండేవాడు.

అవ్వతో కలిసేఉంటున్నా, ఇన్నాళ్ళూ అతను సంపాదించిన దానితోనే అతను తింటున్నాడు. అవ్వ సొమ్ము ఖర్చుచెయ్యటం తన కిష్టం లేదు. ఆమాట ఆమెతో మొదటిరోజే చెప్పేశాడు. ఆ నిబంధనలకు ఆమె ఒప్పుకొన్నాకే అతను అవ్వతో కలిసి ఉండడానికి ఒప్పుకొన్నాడు.

ఆ తర్వాత తిరిగి ఎన్నోరోజులు ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. తనకన్నా....ఆ పేటలో ఉన్న మిగతావాళ్ళంతా సుఖంగా ఉన్నారనిపించింది. హాయిగా రిక్షా తొక్కుకోవడం, డబ్బు సంపాదించుకోవడం, ఏ బాధాలేకుండా సుఖంగా తామింత తిని భార్యా బిడ్డలను పోషించడం ! వాళ్ళెంతో హాయిగా ఉన్నట్లు తోచింది. తనూ హాయిగా వాళ్ళలాగా రిక్షా తొక్కుకుంటేనేం !....ఆలోచించాడు. పరువు ప్రతిష్టలు, బ్రతకటం త్రాసులో వేసి తూచాడు. అసలు బ్రతకాలనుకుంటే, అప్పటి పరిస్థితుల్లో రిక్షా తొక్కడం కన్నా మార్గం లేదు. ఆఖరికి పరువుప్రతిష్టలు, ఆత్మగౌరవం లాంటి మాటలను విడిచేసి బ్రతకాలనే వైపు త్రాసుముల్లు మ్రొగ్గింది

అవ్వతో ఈ విషయం చెప్పగానే ఆశ్చర్యంతో నోరు నొక్కుకుంది.

"నువ్వ రిక్షా కట్తావా !"

"ఏం ! తప్పా ?" అవధాని ఎదురుప్రశ్న వేశాడు

"తప్పని కాదు. నువ్వ బేమ్మడివయుండి, గొప్పింట్లోపుట్టి, అంతో ఇంతో చదువుకొని ఆఖరికి రిక్షాతొక్కడం...."

"ఊరకే కూర్చునేకన్నా ఏదోవిధంగా నాలుగు రాళ్ళు సంపాదించడం ముఖ్యంకాదా !"

"అందుకని బేమ్మణ పుటకపుట్టి...."

"అందుకే నేను రిక్షాతొక్కి డబ్బు సంపాదించుకోవల్సివచ్చింది" అని అన్నాడు స్థిరంగా. చేసేది లేక అవ్వ ఒప్పుకొంది

అవ్వ సహాయంతోనే రిక్షావాళ్ళతో పరిచయమైంది. వాళ్ళే రిక్షా నేర్పించారు అద్దెకు ఇప్పించారు.

కాని ఇవన్నీ ఇవాళ అవ్వ అన్నదాకా జ్ఞాపకంరాలేదు. అతని ఆలోచనలన్నీ ఈరోజు ఒకే విషయం మీదికి కేంద్రీకృతమై ఉన్నాయి.

ఆఖరికి ఆ విషయం తలచుకునే సరికి అవధానికి నవ్వు వచ్చింది. యజమాని స్థితికి !

సాయంత్రం వానలో తడుస్తూ, కాళ్ళు తడబడుతుండగా రిక్షా యజమాని దగ్గర కెళ్ళాడు. రిక్షా అప్పచెప్పాడు. బల్లమీద కాస్సేపు కూర్చుని బయటకొస్తుండగా "అద్దేదోయ్" అన్న యజమానిగొంతు మైకులో అరిగిపోయిన గ్రామఫోనుప్లేటు గొంతులా వినిపించింది.

నిజానికి అప్పుడతనికి అద్దె ఇవ్వాలన్న విషయం జ్ఞాపకం లేదు. అతడు ఆలోచిస్తున్నాడు బలవంతంగా తెంచుకున్న బంధాలదారాలు మనసులో పెనవేసుకుంటూంటే బానిసలా కట్టుబడిపోతున్నాడు.

"నిన్నేనోయ్ ! అద్దె ఇవ్వాలి-మర్చిపోయావా ?"

"ఊ !"

"అహ—అయితే జ్ఞాపకం చేస్తున్నాగా—ఇయ్యి !"

"లేదు."

"అంటే....!"

సమాధానంగా జేబులు విదిలించాడు అవధాని.

ఏం చేస్తాడు రిక్షాయజమాని ! నోరుంది. ఇష్టమొచ్చినట్లు బండబూతులు తిట్టాడు బళ్ళో మాస్టరు పాఠం చెప్పుతూంటే శ్రద్ధగా వినే బుద్ధిమంతుడైన విద్యార్థిలా యజమాని తిట్లను శ్రద్ధగా వింటున్నట్లు అలా నిల్చున్నాడు. కాని నిల్చుని తనదారిన తను ఆలోచిస్తున్నాడు—తనను తానే మరిచిపోయి !

ఎంత యజమానైతే మాత్రం ఉలుక్కుండా పలుక్కుండా నిలబడ్డవాడిని ఎంతసేపనితిడతాడు. నోరు నొప్పి పుట్టింది. కాని ఇప్పుడు మధ్యలో ఆపితే తన చేతకానితనం వ్యక్తమవుతుంది. పెద్ద చిక్కులో పడ్డాడు రిక్షా యజమాని !

"మొద్దులా నిలబడతావేరా ! ఎళ్ళు !" అని అన్నాడు ఆఖరికి. అవధాని అప్పటికి ఈ లోకంలోకి వచ్చాడు.

"అయిందా !" అన్నాడు ప్రశాంతంగా.

అతని ప్రశ్నకు రిక్షా యజమాని బిత్తరపోయి చిత్తయి అలాగే చూస్తూ నిలబడ్డాడు. అవధాని ఇంటికి నడిచాడు. అతని వెనుకనే వచ్చిన తోటి రిక్షావాడు అతన్ని మెచ్చుకున్నాడు. అవధానిని అడిగితే అక్కడ జరిగిన కథంతా చెప్పేడు.

"ఏమిట్రోయ్ అబ్బీ ! నవ్వుకొంటున్నావు ! ఏదో కథఉందే !"

కథ అనగానే అతనికి తనకథ జ్ఞాపకం వచ్చింది. ఇంతలో మొహం మారిపోయింది. తన జీవిత కథ కళ్ళఎదుట నృత్యం చేసింది.

"అవునవ్వా ! నిజంగా కథే ! నీతో చెప్పితేకాని నా బాధ తీరదు." అతనిగొంతు జీరపోయింది బాధతో.

"అదేమిటో చెప్పరా నాయనా ! బాధపడటం దేనికి !"

"చెప్తానవ్వా ! క్లుప్తంగా నాలుగుముక్కలు చెప్తాను." అతను ఆగి ఒక్క క్షణం కళ్ళుమూసుకున్నాడు. హృదయంలో పేరుకుని ఉన్న బాధ ఒక్క నిట్టూర్పుతో కరిగించుకొన్నాడు.

"నాకు పెళ్ళయింది !" అకస్మాత్తుగా అన్నాడు నొక్కి పలుకుతూ.

"ఆ !"

"తండ్రి ఉన్నాడు. తల్లి నేను బి. ఏ. చదువుతూండగా చనిపోయింది."

"బియ్యే, యమ్మేలంటే పెద్ద చదువులు కదా బాబూ ! మా రామిగాడి కొడుకు కూడా చదివిందేగా !"—ఆశ్చర్యంగా అడిగింది అవ్వ.

"అవును పెద్దచదువులే ! కాని పనికిమాలిన చదువులుకూడా ! ఉన్న డబ్బును వూడ్చివేసి కూడు సంపాదించిపెట్టలేని ఆ ముష్టి చదువునే నేనూ చదివాను పాసయ్యాను. చదువుతూండగానే నాకు పెళ్ళయింది. బి. ఏ.

చదువుకోగానే నేనేదో ప్రయోజకుడినైనట్లు నేను వద్దనేకొద్దీ నా భార్యను కాపరానికి తీసుకొచ్చారు పెద్దలంతా కలిసి! మా అమ్మలేని కళను ఆ యింటికి ఆమె తెస్తుందని అంతా సంబరపడ్డారు.

"అమ్మ ఉన్నప్పుడే నాన్నకి ఇంటి విషయం పట్టేదికాదు. అమ్మ కూడా చనిపోవడంతో ఆయనదోవన ఆయన సన్యాసుల్లో కలిసిపోయారు. ఇంట్లో ఉన్న వస్తువులనమ్మి, కొన్నాళ్ళు గడిపాము. తర్వాత ఇల్లే అమ్మే యాల్సిన స్థితి వచ్చి అమ్మేశాను.

"పరిస్థితులను గమనిస్తున్న నాభార్య, వాళ్ళ నాన్న సహాయాన్న ర్థిస్తూ జాబువ్రాసింది. దానికి బదులు ఆయనవచ్చి బలవంతంగా దాన్ని తనతో తీసికెళ్ళాడు. అడ్డుచెప్పబోయిన నాతో ఉద్యోగమొచ్చి మగాడివైన నాడు, మళ్ళీ నీ గడపలోకి నా కూతుర్ని తీసుకొచ్చి స్వయంగా దిగపెడ్తా!" అని జవాబిచ్చాడు.

"ఆయన చెప్పినమాట నాకూ నిజమనిపించిందప్పుడు. తనకులేదు గాని మెడకొక డోలు అన్నట్లు బతకలేని నాకు భార్యకూడా ఎందుకనిపిం చింది. క్షణకాలం బ్రతుకుమీద రోతపుట్టింది.

"కాని నాకు జీవితమంటే ఆశ!....ఆ ఆశ నన్ను జీవించేటట్లు చేసింది. ఆ ఆశే నన్ను అన్వేషణకు ప్రపంచంలోకి పంపింది. తిరిగాను. ఎన్నెన్నోసుఖాలు కష్టాలు అనుభవించాను. కాని ఎక్కడా నిలకడలేక పోయింది. నాజీవితాన్నొక బొంగరం చేసుకొని విధి నాతో ఆటలాడుకొంది. ఆ బొంగరము ఇక తిరగలేక పగిలిపోయే స్థితిలో ఇక్కడికొచ్చాను. ఈ స్థితికి దిగజారిపోయింది.

"కాని—ఇవాళ .... ఈ స్థితిలోనే... నేను నాభార్యను కలుసు కొన్నాను." అతని కంఠం రుద్దమయింది.

"నీ భార్యనా!"

"అవును."

"ఓరి ! తీసుకొనిరాలేకపోయావా ఇక్కడికి. అదొక్కటే కష్ట మవుతుందా మనకు ! మనతోపాటు అదీ ఇంత తిని పడి ఉంటుంది !"

అవ్వ అమాయికపు మాటలకు అవధానికి నవ్వొచ్చింది. కాని నవ్వ లేదు. అతను నవ్వే స్థితిలో లేడిప్పుడు తన నిస్సహాయ స్థితి అతనిహృద యంలో పరితాపరూపంలో ప్రజ్వరిల్లుతున్నది.

ఆమె ఉద్యోగం చేస్తున్నట్లుంది.

"ఉద్యోగం !"

"అవును. ఉద్యోగం ! డబ్బుకు కూడా కొరత ఉన్నట్లులేదు కాని ఆమె అందం, యవ్వనం ఒంటరితనం ఆమె శత్రువులై ఆమెను అను క్షణం బాధించటాన్ని నేను ప్రత్యక్షంగా చూచాను."

"నువ్వు కన్పించావుగా .. మాట్లాడలే ?"

"నన్ను గుర్తుపట్టే స్థితిలో లేదామె !"

"సిగ్గుపడిందేమో పాపం. పిచ్చినాగన్నవి — నీకుతెలుస్తేనా ! నువ్వే మాట్లాడించాల్సిందిరా అబ్బిగా !"

"నేనా ! .. ఇలాంటి నికృష్టస్థితిలో ఉండి ఎన్నడోవదిలిపెట్టిపోయిన భార్యను ఎలా మాట్లాడించాలవ్వా. .. అస లామె కంటికి కనబడనంతదూరా నికి వెళ్ళిపోవాలనుకొన్నాను మొదట్లో. కాని ఇప్పుడు నాకాశక్తి లేదు. ఏదో శక్తి నన్నామె వైపుకు లాక్కొని పోతున్నది. అలాంటి ఒంటరి స్థితిలో అనుక్షణం తనపీడను చూచుకొని తానే భయపడేస్థితిలో, ఆమె నొదిలి, పిరికివాడిలా తిరిగి పారిపోలేను నేను. పోకుండా ఉండి ఆమెకు నా నిజస్వరూపం చూపించి బాధపెట్టలేను. చెప్పవ్వా, ఏం చెయ్యాలినేను ! స్వర్గ నరకాలమధ్య బంధితుడనై ఊపిరాడక కొట్టుకొంటున్న నా బాధకు విముక్తి ఎలా దొరుకుతుంది ! ఈ నిరుద్యోగ సమస్య కోరల బారినుండి నేనెలా తప్పించుకోవాలి ! చెప్పవ్వా....అవ్వా !"

అతనికళ్ళలోనుంచి కారిన కన్నీరు ఎండిపోతున్న అన్నంలోపడి,

అన్నాన్ని తడిపింది. అతని చేతికున్న ఎంగిలి కడిగివేసింది.

అవ్వ అతనిదగ్గరకువచ్చి ప్రేమతో అతని తల నిమిరింది. దుఃఖం పట్టలేని అతను అవ్వ ఒడిలో తలదూర్చి పిల్లవాడిలా ఏడ్చాడు అవ్వ కంటినుండి కారిన కన్నీటి బిందువులు ఆముదపు ప్రమిదె కాంతిలో క్షణ కాలం తళుక్కుమని అతని తలమీదకు జారిపడ్డాయి.

"ఫర్వాలేదు నాయనా ! విచారించకు. కష్టాలు కలకాలం నిలవ వంటారు పెద్దలు ! నీకు మంచిరోజులు రాబట్టే అమ్మాయి నీకంట పడింది ....నామాటవిని రేపేవెళ్ళి అమ్మాయితో మాట్లాడు నాయనా ! కావాలంటే నేను వస్తా. నువ్వీ రిక్షా పని చెయ్యలేవనిచెప్తే విన్నావా నామాట ! ఈ ముసలిముండ ఉండగా నీకేం భయం లేదుగా ! చూడు ! నేను కూడబెట్టిన డబ్బుంది కాస్త ! నీకన్నా నాక్కావల్సివాళ్ళెవరున్నారు గనుక ! ఆ డబ్బు తీసుకొని జాగ్రత్తగా వ్యాపారం చేసుకో .... ఈ ముష్టి ఉద్యోగాలు నీకెందుకుగాని !" అతని వీపుమీద జోకొట్టినట్లు చిన్నగా తట్టుతూ ప్రేమగా చెప్పుకుపోతున్నది అవ్వ.

"ఊరికే నా డబ్బు తీసుకోవద్దులే ! లాభంరాగానే వడ్డీతో సహా యిద్దువుగాని ! ఆ...."

అవ్వ ఇంకా ఏవేవో చెప్పుకుపోతున్నది తన్మయత్వంలో ! ఇవాళ తనకొడుకు వచ్చి ఒళ్లో పడుకొన్నట్లు ఆమె ఆనందిస్తూంది.

"తనకొడుకు కోడలును ఇంటికి తీసుకొస్తాడు. పండంటి పిల్లల్ని కంటాడు. తన మనమళ్ళతో ఆడుకొంటూంటే మొగుడూ పెళ్లాలిద్దరూ కలిసి దొంగచాటుగా తననుచూచి నవ్వుకొంటారు-" అవ్వ కళ్ళలో కలలు కళ్ళుచేసుకొని మెరుస్తున్నాయి.

కాని అవధాని అవ్వమాటలు వినటం లేదు. అతని హృదయంలో ఆశాజ్యోతి కలిగింది. కాటుకలాంటి చీకటిలాగా కమ్ముకొని ఉన్న నిరాశను పారద్రోలింది. హృదయం తేలికపడింది.

"నేటి"ని మరిచిపోతూ, "రేపు"ను గూర్చి తీయని కలలు కంటూ అవ్వ ఒడిలోనే పడుకొని హాయిగా నిద్రించాడు.

* * *

ప్రమోషన్ వచ్చిన సీనియర్ గుమాస్తా మొహంలా, లోకం వెల వెలపోతున్న మొహంలో కళకళలాడుతున్న కళ్ళు విప్పింది. వర్షం తగ్గి పోయింది. సూర్యుడు ఉదయించాడు.

అవధాని పొద్దెక్కాలేచాడు చివాలున.

"రోజూ ఆవేళకు రిక్షాతీసుకొని తనొకదారిన, "టూరింగ్" కొట్టుతో అవ్వ మరొకదారిన పోయేవారు. కాని, తనిక రిక్షా తొక్కడు. తొక్కాల్సిన పనిలేదు. "పాపం, అవ్వ ఒంటరిగా పోయి ఉంటుంది" అని అనుకొంటూ లేచాడు.

ఎదురుగ్గా అవ్వ విల్చొని ఉంది.

"నువ్వు తొందరగాపోయి, ఇకనైనా ఆ గడ్డం తీసేయించు నాయనా! సన్యాసిలాగా ఆ గడ్డమేమిటి — అసహ్యంగా! అమ్మాయి చూస్తే జడుసుకొంటుంది!" అని అంది నవ్వుతూ.

అవ్వ అతన్ని అలా ఎన్నోసార్లు అడిగింది. కాని అతనెన్నడూ ఆ ప్రశ్నకు జవాబివ్వలేదు. గడ్డం గొరిగించనూ లేదు. అసలు ఆమె చెప్పింది విననట్లే వటించేవాడు. కాని, ఇవాళ ఇన్నాళ్ళతర్వాత ఆమె చెప్పింది నిజ మనుకున్నాడు. నిజం! తన భార్య భయపడుందికూడా! కొన్నాళ్ళు తన గడ్డాన్ని చూచి మురిసిపోయిన అతనికి ఆ గడ్డమంటే అసహ్యమేసింది. భయం పుట్టిందిప్పుడు!

"అలాగే అవ్వా!" అని అంటూ వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకోవ డం మొదలుపెట్టాడు. ఆ రోజు అతనిలో ఏదో కొత్తఉత్సాహం వచ్చింది.

"జీవితంమీద ఆశఉంటే చాలదు. బ్రతుకును చూచి భయపడి పారి

పోకుండా, నిబ్బరంగా నిలబడి, ఆనందాన్ని పొందాలి!" అని పదేపదే అనుకొన్నాడు మనస్సులో.

వరుసగా తానారోజు చెయ్యాల్సిన పనులన్నిటినీ మననం చేసుకో సాగాడు.

కాలకృత్యాలు పూర్తికాగానే, అవ్వనడిగి కాస్త డబ్బు చేబదులు తీసుకోవాలి. వెంటనే మంగలిషాపుకెళ్ళి గడ్డం గొరిగించుకోవాలి. అక్కడ నుంచి నేరుగా రెడ్డిగారి కంపెనీకెళ్ళి తన బాధ అంతా చెప్పుకొని ఉద్యోగం కోసం ప్రాధేయపడాలి. ఆయన తన మాటకు కాదనడు. తనకు తప్పక ఉద్యోగం ఇస్తాడు. తనకు మంచిరోజులు రాబోతున్నాయి.

ఒకవేళ రెడ్డిగారు కాదంటే—అక్కడే సత్యాగ్రహం చెయ్యాలికాని వదలకూడదు. ఉద్యోగం లేకుండా ఆమె మొహం చూచేకన్నా ఏ నిరాహార దీక్ష పూనో నిరుద్యోగులకోసం మరణించడం మేలు! అంతే... తను ఉద్యోగం సంపాదించి మనిషిగా జీవించటమో, లేకపోతే తనలాంటి వాళ్ళందరి భవిష్యత్తుకోసం చావటమో.

కాని రెడ్డిగారు కాదనరన్న నమ్మకం అవధానికి ఉంది.

ఆరోజు ఆయన్ను తన రిక్షాలో ఎక్కించుకొని పోతున్నప్పుడు మాటల సందర్భంలో తను బి. ఏ. అని చెప్పేసరికి ఆయన మొహంలో కనిపించిన జాలి, బాధ అతనికి బాగా జ్ఞాపకం ఉంది. రిక్షా దిగాక అతని భుజాన్ని తట్టుతూ లోనికి తీసికెళ్ళారు. కాగితం కలం ఇచ్చి అప్లికేషను రాయించుకొన్నారు. ఆతర్వాత అయిదు రూపాయల కాగితం చేతిలో పెడుతూ గద్గదస్వరంతో అన్నారు: "నీలాంటివాళ్ళు ఈదేశంలో ఎందరో ఉన్నారని విన్నాను. కాని, నిన్ను ఈనాడు నా కళ్ళతో స్వయంగా చూచాను. నీలా నిరుద్యోగంతో బాధపడుతున్న అందరికీ నేను సహాయం చేయలేకపోయినా, కనీసం నీ ఒక్కడికైనా చేయగలిగితే నాకెంతో ఆనం

దంగా ఉంటుంది. సాధ్యమైనంత త్వరలోనే నీకు ఉద్యోగం వచ్చే ఏర్పాట్లు చేస్తాను."

అవధాని హృదయం ఆనందంతో నిండిపోయింది. తనకు ఉద్యోగం ఇస్తానన్నందుకు కాదు—తనపట్ల అంతగా జాలి చూపినందుకు కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి. ఇతనిలా ఉక్కిరి బిక్కిరవుతుండగానే ఆయన వెళ్ళిపోయారు. అవధాని బయటికొచ్చాడు.

అటువంటి రెడ్డిగారు తనకు సహాయం చెయ్యరా ! చేస్తారు. తప్పక చేస్తారు. పదేపదే ఆమాట అనుకొనేసరికి పదిఏనుగుల బలం వచ్చింది అవధానికి. ఆలోచనాలత అల్లుకుపోతూంది పైకి

తర్వాత—ఉద్యోగం వచ్చినతర్వాత తా నామె వద్దకు వెళ్తాడు. వెనుకగావెళ్ళి కళ్ళుమూస్తాడు మొదట్లో ఆమెభయపడి కెవ్వుమని కేకేయ బోతే, పెదవులను కదలకుండా, తన పెదవులతో మూస్తూ, చెయ్యి తియ్యాలి. ఆమె తనను చూచి ఆశ్చర్యపోతుంది. అంతలోనే సిగ్గుపడు తుంది. తర్వాత ...

పోస్టుబంట్రోతు విసిరిన కవరు గుడిసెలో కొచ్చి, అవధాని కాళ్ళ ముందర పడింది. ఆలోచనలకు తాళంవేసి ఆత్రంగా విప్పిచూచాడు. "అవ్వా" అని అరిచాడు సంతోషంగా ! పరుగెత్తుకొంటూ వెళ్ళి అవ్వను కావలించుకొన్నాడు. ఎత్తుకొన్నాడు.

"ఏమిటిరా అబ్బీ ఇది ! ... సంగతేంటో చెప్పు !"

"ఉద్యోగం....నాకు ఉద్యోగం ..." మాట పెగలటం లేదు సంతో షంలో.

"వచ్చిందికదూ ! నాకు తెలుసురా అబ్బీ ! పిల్లది మహా అదృష్ట వంతురాలు."

"అవునవ్వా ! రెడ్డిగారు దేవుడు. నువ్వు దేవతవు ! ఇక నువ్వు కష్టపడనక్కర్లేదవ్వా ! అది మరేమో ..."

ముడుతలుపడ్డ అవ్వ మొహంలో ఆనంద రేఖలు ఉదయించాయి.

"అంతా ఆ భగవంతుడి దయ నాయనా !"

ఇంకోరోజైతే అవధాని ఆ మాటను ఖండించేవాడే। మానవుడి స్వకీయ కష్టంవల్ల, భుజశక్తివల్ల సుఖం వస్తే అది భగవంతుడి దయా ! కష్టాల ననుభవించినంతకాలం ఆ భగవంతుడెక్కడున్నాడు! అన్నవాదనకు దిగేవాడే. కాని ఈ వాళసలు ఆ మాటను వినే స్థితిలో లేడు.

ఆనందపు విమానంలో కూర్చుని, రెడ్డిగారి కంపెనీ కెళ్ళాడు. గదిలో కూర్చుని ఏదో వ్రాసుకొంటున్న ఆయన కాళ్ళమీదపడి కన్నీళ్ళతో అభిషేకించాడు.

"నా కృతజ్ఞత నెలా తెల్పుకోవాలో నా కర్థంకావడంలేదు" అని అన్నాడు. రెడ్డిగారి మెరిసిన చిక్కటి మీసాలవెనుక చిరునవ్వు ఒకటి తళుక్కుమని త్రుటిలో మాయమైంది. మొహం గంభీరంగా మారింది.

"ఈవాళ నీకు ఉద్యోగం వచ్చినందుకు కాదు సంతోషించాల్సింది. ఇన్నాళ్ళు ఎందుకు రాలేదా అని మేమంతా విచారించాలి. నేనేకాదు ప్రభుత్వం, ప్రజలు, అందరూను। నీలాంటి చదువుకున్న యువకులందరూ సుఖంగా ఉన్నప్పుడే దేశ ప్రగతి !" అని అన్నారాయన గంభీరంగా.

అవధాని ఎన్నో చెప్పాలనుకున్నాడు. కాని ఏమీ చెప్పలేకపోయాడు. నిశ్శబ్దంగా అలాగే కూర్చున్నాడు.

"మేనేజరును కలుసుకొని మిగతా విషయాలు మాట్లాడు" అని అంటూ బల్లమీద ఉన్న కాగితాలవైపుకు దృష్టి మళ్ళించారాయన.

అవధాని లేచి బయటికొచ్చాడు. రెడ్డిగారి మాటలు, చేతలు కళ్ళ ముందు మెదులుతున్నాయి. "ఆయనలాగా మాటలకన్నా చేతలు ముఖ్యంగా ఎంచుకుని కృషిచేసేవారు ఈ దేశంలో నూటికి నలుగురున్నా దేశం ఇలా ఉంటుందా !" అని అనుకున్నాడు మనస్సులో.

జాయినింగు రిపోర్టు ఇచ్చాడు. తన సీటులో కూర్చున్నాడు. భూత భవిష్యద్వర్తమానాలలో విహరిస్తూ కూర్చున్నాడు.

రెడ్డిగారు....అవ్వ....తనభార్య....తన జీవితం ఆనందం....

నవ్వుతూవచ్చి మేనేజరు పలకరించేవరకు అతను ఎక్కడో ఉన్నాడు. గడియారం ఆరుగంటలు కొట్టింది.

సిగ్గుతో తల వంచుకున్నాడు. ఇన్నిగంటలు తనేంచేసినట్లు కుర్చీలో కూర్చుని!

"ఫరవాలేదు. కొత్తకదూ!" మేనేజరు నవ్వుతూ అని వెళ్ళి పోయాడు.

అవధాని కుర్చీలో నుంచి లేచి బయటకు నడిచాడు.

* * *

"రిక్షా"—రిక్షా వచ్చి ఆగింది.

"ప్రకాష్‌నగర్‌కు వస్తావా!"

"ఎక్కండిబాబూ!"....రిక్షా ముందుకుకదిలింది.

అస్తమయ సూర్యుని అరుణకాంతులతో, ఉదయ చంద్రుని రాగ రేఖలతో పులుముకున్న ఆకాశం ఎర్ర చీరెను సింగారించుకొన్నట్లుంది.

రిక్షావాడు వగరుస్తూ తొక్కలేక తొక్కుతున్నాడు. అవధాని ఆలోచనలు అనంతవేగంతో పరుగిడుతున్నాయి.

"కాస్త తొందరగా పోనియ్యి రిక్షా!"

"దీని సిగతరగ—గాలికూడా ఇప్పుడే వచ్చింది బాబూ! ఇంకే ముందిలే బాబూ! ఈ ఎత్తు దాటితిమంటే ఇకంతా పల్లం నాసామి రంగా! రిక్షా మాజోరుగా పోతుంది. పల్లందిగినకాడ నుంచి రోడ్డంతా సాఫీగానే ఉంటుంది. ఈ ఎత్తులు, దిగుడులతో ఈ కాస్తంత లెక్కే నయ్యా మా పేనాలకి సానాకష్టం!"

సూర్యుడు అస్తమించాడు. వ్యూహాకారంలో చిన్నచిన్న మబ్బులు ఆకాశంలో అల్లుకొంటున్నాయి శ్రావణ పున్నమి చంద్రుడు తన విరోధులను చూచి నవ్వుకొంటున్నట్లు వెలుగుతున్నాడు.

అవును. కష్టపడి ఈ ఎత్తు పల్లాలను దాటితేనే తర్వాత సుఖం. జీవితంకూడా అంతే !... తనీ ఎత్తుపల్లాలను అధిగమించాడు. తన జీవితం నున్నటిరోడ్డుమీద హాయిగా పయనిస్తుందింక !"—తృప్తిగా నిట్టూర్చాడు అవధాని.

అవధాని ఆ ఇంటిముందు రిక్షా దిగేసరికి చీకటి పడింది. ఇంట్లో గుడ్డిదీప మొకటి మందంగా వెలుగుతూంది. తన ఆనందాన్ని హరిస్తాయేమో నన్న భయంతో చంద్రుడు మేఘాలతో కుస్తీ పట్టుతున్నాడు.

అవధాని మెల్లగా వరండాలోకి వెళ్ళాడు. నిన్నటికీ ఈవాళటికీ తన జీవితంలో గల భేదం అతని మనస్సుకు తట్టింది.

నిన్నటి అతను పిరికివాడు—నిరాశాపూరిత హృదయుడు !

ఇవాళటి తాను ధైర్యవంతుడు. ఆశల అందలంలో నివసిస్తున్నాడు.

అవధాని తలుపు తట్టాడు మెల్లగా ! తాకిడికే తెరుచుకుంది తలుపు. చక్కని చిన్న హాలు. హాలులో ఎదురుగా తన ఫోటో !

ఇంట్లో ఎవరూ ఉన్న సవ్వడి లేదు. ప్రశాంతంగా, గంభీరంగా ఉంది. ప్రక్కన కాస్తంత దూరంగా ఉన్న ఇళ్ళల్లోనుంచి వినవస్తున్న రేడియో రణగొణలు ప్రశాంతతను అప్పుడప్పుడూ భగ్నం చేస్తున్నాయి.

ఫోటోపైపే నిశ్చలంగా చూస్తున్న అవధాని దృష్టి కాస్త మారేసరికి గోడకున్న అద్దంలో తన ప్రతిబింబం కనిపించింది. రెంటికీ ఎంత వ్యత్యాసం ! సన్నగా నవ్వుకొన్నాడతను.

"పాపం ! తనకోసమే రోజూ ఎదురుచూస్తుందన్నమాట ! పక్కింటికెళ్ళి ఉంటుంది. రాగానే ఆశ్చర్యపరచాలి' అని అనుకొని

స్వతంత్రంగా మేజా కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

గదినంతా పరికిస్తున్న అతని దృష్టి ఎదురుగా ఉన్న బల్లమీదకు పోయింది.

జానకికి పుస్తకాలంటే మొదటినుంచీ ఇష్టం కాపురాని కొచ్చేసరికి ఎస్. ఎస్. ఎల్. సి. పాసయింది. తన దగ్గరికొచ్చాక కూడా తన పాత పుస్తకాలను చదివేది దీక్షగా !

మేజానిండా పుస్తకాల దొంతరలు ! తీసి చూచాడు. అన్నీ తన బి. ఏ. చదివేనాటి పుస్తకాలు !

అకస్మాత్తుగా అతని దృష్టి పుస్తకాల ప్రక్కన పేపర్‌వెయిట్ క్రిందపడి స్వేచ్ఛకోసం పోరాడుతున్న ఒక కాగితంవైపు మళ్ళింది. నిజం ....అది జానకి దస్తూరే ! .. అవధాని హృదయం పులకరించిందెందుకో !

ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నాడు ఆనందంగా ! తెల్లగా వెలుగుతున్న చంద్రుని మబ్బులు అంధకారంలో ముంచివేశాయి.

"ప్రగతిపథంలో పయనిస్తున్న ఈ లోకంలో నాకు చోటులేదు. స్త్రీకి ఎంత స్వేచ్ఛ ఇచ్చినా, ఎన్ని మాటలు చెప్పినా, మానవతిగా బ్రతక దలచుకొన్న స్త్రీ—అందులోనూ నాలాంటి అందమైన ఒంటరిస్త్రీ—మన లేదని నా స్వానుభవం మీద తెలుసుకొన్నాను స్త్రీకి మాటల్లో ఇచ్చినంత విలువ కార్యరూపంలో కొచ్చేసరికి విరుద్ధమవుతున్నదన్న దొక సత్యం. ఇన్నాళ్ళూ ఎవరికోసమైతే ఎదురుచూచానో, వారు వస్తారన్న ఆశ నాకు నశించింది. ప్రాణంకన్నా మానం ముఖ్యమనుకునే దాన్నవటంవల్ల, మనసును చంపుకొని, నైతిక పతనాన్ని చెందలేక, రెండోది శోకముండే మొదటిదాన్ని బలవంతంగా త్యజిస్తున్నాను... నా కర్మకు ఎవరిని నిందించీ ఏమి ప్రయోజనం ?

చదవగానే "జానకీ" అని బిగ్గరగా అరవబోయాడు. కాని గొంతు

పెగలలేదు. మనసు "జానకీ....జానకీ" అని బిగ్గరగా శోకించింది ... ఘోషించింది.

పిచ్చివాడిలా లేచి ప్రక్కగదిలోకి వెళ్ళాడు. కాళ్ళు తడబడ్డాయి. పెదిమ లదురుతున్నాయి. శూన్యంగా ఉన్న ఆగది వెక్కిరించింది. ఆ పక్కనే ఉన్న పడకగది వాకిలిదగ్గరికి వెళ్ళేసరికి అణిగిఉన్న పిలుపు పైకి పొంగింది.

"జానకీ జానకీ"—పిచ్చిగా అరిచాడు.

ప్రేమగా పిలిచినట్లు వినపడ్డ ఆ గొంతులోని పిలుపు విని నోటికి అందించబోతున్న గ్లాసును క్రిందికి దించి ఆమె అవధానివైపు చూచింది.

"నేను.... నేను జానకీ ! వచ్చాను జానకీ ! నీ కోసం .. నన్నెందు కిలా ఒంటరిచేసి పోదామనుకున్నావు జానకీ !" దగ్గరికివచ్చి ఆమె భుజాలు పట్టుకొని దగ్గరికి తీసుకుంటూ అన్నాడు దుఃఖంతో !

ఆమె ముఖం వికసించింది. కలువలాకాదు. తన పూర్వపు మొహం లానే వికసించింది అందంగా ! చేతిలోని గ్లాసు క్రిందికి జారిపోయింది.

"మీరు మీరు .." అని అంటూనే, ఇక మాటలు రాక మూగదై ఆనందంతో ఏడుస్తూ అతని హృదయంమీద వాలిపోయింది.

మబ్బులతో పోరాడి పోరాడి, ఓడిపోయి, ఆఖరికి గెలిచిన చంద్రుడి ముఖం షోడశ కళలతో విరాజిల్లుతూ వెలుగుతూంది.

(ఆంధ్రప్రభ వారపత్రిక 7-3-1962)

కారా 24.11.92

రచన నిలయం శ్రీరామరం